# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

# Bullet Edition

శుక్రవారం 21-06-2024 4 PM




## గౌరవ సభలోకి సీఎం చంద్రబాబు

### పవన్, జగన్ సహా సభ్యుల ప్రమాణ స్వీకారం

అమరావతి, జూన్ 21 (ప్రజాస్వరం) : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం ఉదయం ప్రారంభయ్యాయి. ప్రొటెం స్పీకర్‌గా గోరంట్ల బుచ్చయ్య అధ్యక్షతన శాసనసభ కొలువుదీరింది. గౌరవ సభలోకి సీఎం చంద్రబాబు అడుగు పెట్టగానే హర్షధ్వానాలతో కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులు స్వాగతం పలికారు. అంతకు ముందు అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద చంద్రబాబు నమస్కారం చేశారు. వేద పండితులు పూర్ణ కుంభంతో చంద్రబాబుకు స్వాగతం పలికారు. తన ఛాంబర్ లోకి వచ్చిన బాబుకు ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం ప్రొటెం స్పీకర్‌గా గోరంట్ల బుచ్చయ్య సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సీఎం చంద్రబాబుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి, మిగిలిన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.




## జయహో జయశంకర్ సార్

- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 21 (ప్రజాస్వరం) : తెలంగాణ స్వరాష్ట్ర సాధనకు పోరుబాట చూపిన ఉద్యమ నేత ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు నివాళులర్పించారు. స్వరాష్ట్ర సాధనే ఊపిరిగా బతికిన సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కొనియాడారు. ఆయన స్ఫూర్తిని తమ గుండెల నిండా పదిలంగా ఉంచుకున్నామని తెలిపారు. జయహో జయశంకర్ సార్ అని యావత్ తెలంగాణ పిడికిలెత్తి జోహారులర్పిస్తున్నదంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా హరీశ్‌రావు నివాళులర్పించారు.



## శ్రీనగర్‌లో మోదీ యోగా



- పదో అంతర్జాతీయ యోగా దినోత్సవం

శ్రీనగర్, జూన్ 21 (ప్రజాస్వరం) : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శ్రీనగర్‌లోని దాల్ సరస్సు ఒడ్డున గల షేర్-ఎ-కశ్మీర్ కాన్ఫరెన్స్ హాల్ వద్ద అంతర్జాతీయ యోగా దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరై సరస్సు ఒడ్డున ప్రజలతో కలిసి యోగాసనాలు వేశారు. శ్రీనగర్‌లో ఒక శక్తి ఉందని, యోగా ద్వారా దానిని మరింత పెంచుకోవచ్చని తెలిపారు. గత పదేండ్లుగా ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవం జరుపుకుంటున్నామని చెప్పారు. ప్రపంచ యోగా గురుగా భారత్ మారిందని , యోగా ప్రాముఖ్యత రోజురోజుకు పెరుగుతున్నదని చెప్పారు. యోగా సాధన వల్ల సకారాత్మక ఆలోచనలు, ధ్యానంతో ఏకాగ్రత పెరుగుతుందని మోదీ పేర్కొన్నారు. జర్మనీ దేశంలో నేటికి కోటిన్నర మంది నిత్యం యోగా చేస్తున్నారని పేర్కొన్నారు. భారత దేశంలో యోగా నేర్పే మహిళకు పద్మశ్రీ పురస్కారం కూడా దక్కిందని గుర్తు చేశారు. అనేక యూనివర్సిటీల్లో యోగా కోర్సులు కూడా వచ్చాయని అన్నారు. మొత్తానికి యోగా గురువుగా భారత్ అవిర్భవించడం సంతోషదాయకమని ప్రధాని మోదీ అన్నారు.



## ప్రారంభమైన బొగ్గు గనుల వేలం

- హాజరైన డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, జూన్ 21 (ప్రజాస్వరం) : బొగ్గు గనుల వేలం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. వెస్ట్ ఇన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వేలం ప్రక్రియను మొదలు పెట్టారు. తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, గనుల శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. దేశంలో పెరుగుతున్న ఇంధన అవసరాలను తీర్చడానికి ఈ వేలం వేస్తున్నామని, మార్కెట్‌లో బొగ్గుకు విపరీతమైన డిమాండ్ ఉందని కిషన్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఒక బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. సింగరేణికి కొత్త గనులు కేటాయించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టిని కోరారు. తెలంగాణలో పరిస్థితులు కిషన్ రెడ్డికి బాగా తెలుసని డిప్యూటీ సీఎం అన్నారు. గత ప్రభుత్వం తప్పిదాలతో సింగరేణి సంస్థ రెండు సార్లు వేలంలో పాల్గొనలేదని గుర్తుచేశారు.



## ఉరేసుకొని కాంగ్రెస్ ఎమ్మెల్యే భార్య బలవన్మరణం..

- ఇద్దరిదీ ప్రేమ వివాహం..

హైదరాబాద్, జూన్ 21 (ప్రజాస్వరం) : చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య రూపాదేవి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అల్వాల్ పంచశీల కాలనీలోని ఇంట్లో గురువారంరాత్రి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. 12 సంవత్సరాల క్రితం రూపాదేవిని మేడిపల్లి సత్యం ప్రేమ వివాహం చేసుకున్నారు. రూపాదేవి మేడ్చల్ మునిరాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. కడుపునొప్పితోనే ఆమె ఆత్మహత్య చేసుకున్నారని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. ఈమేరకు పోస్ట్ మార్టం పూర్తిచేసిన అనంతరం కుటుంబ సభ్యులకు మ్రుతదేహాన్ని అప్పగించారు. అల్వాల్ పరిధిలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



## విధులు బహిష్కరించి ఆర్టీసీ డ్రైవర్ల నిరసన

- పనిభారం తగ్గించాలని డిమాండ్

**మెదక్, జూన్ 21 (ప్రజాస్వరం):** పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ డ్రైవర్లు విధులు బహిష్కరించి డిపో ముందు శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ సంఘటన మెదక్ జిల్లాలో చోటుచేసుకుంది. ఆర్టీసీ డ్రైవర్లపై మెదక్ డిపో మేనేజర్ సుధ, సీఐ వేధింపులకు గురిచేస్తున్నారని చార్జి షీట్ ఇప్పిస్తున్నారని ఆరోపిస్తూ మెదక్ డిపో ముందు 60 మంది డ్రైవర్లు స్వచ్ఛందంగా విధులు బహిష్కరించి శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ... టిమ్స్ డ్యూటీ చేయాలని నెల రోజుల నుంచి డిపో మేనేజర్, సీఐ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని వారం ముందు డిపో మేనేజర్‌కు నోటిస్ అందజేశామని తెలిపారు. ఇంటి దగ్గర 10 గంటల కూడా ఉండలేకపోతున్నామని వాపోయారు. హోటల్లో తిని డిపోలో పడుకుని డ్యూటీ చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రెస్టు లేకుండా డ్యూటీ చేయడంతో 10 మంది డ్రైవర్లు అనారోగ్యం పాలై హాస్పిటల్లో ఉ న్నారన్నారు. గతంలో ఒక ట్రిప్పు జేబీఎస్ వెళ్లి వస్తె డ్యూటీ అయిపోతుండేదని, ఇప్పుడు అదనంగా ఒక ట్రిప్పు జేబీఎస్ పెట్టి నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని భార్యాపిల్లలను చూసుకో లేకపోతున్నా మని తెలిపారు.



# బీఆర్ఎస్‌కు బిగ్ షాక్

## కాంగ్రెస్‌లో చేరిన పోచారం శ్రీనివాస్ రెడ్డి

- మాజీ స్పీకర్ ఇంటికి వెళ్లి ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి
- రైతు సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసమే: పోచారం
- సముచిత స్థానం కల్పిస్తాం: సీఎం రేవంత్

హైదరాబాద్, జూన్ 21 (ప్రజాస్వరం) : వరుస ఓటములతో కుదేలైన బీఆర్ఎస్ కు మరో షాక్ తగిలింది. కేసీఆర్ కు సన్నిహితుడు, పార్టీ సీనియర్ నేత, మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీని వీడి కాంగ్రెస్ లో చేరారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి బంజారాహిల్స్ లోని పోచారం నివాసానికి స్వయంగా వెళ్లి కాంగ్రెస్ లోకి ఆహ్వానించారు. శ్రీనివాస్ రెడ్డితో పాటు ఆయన కుమారుడు భాస్కర్ రెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పోచారం అనుభవం ప్రభుత్వానికి అవసరమని, పార్టీలో ఆయనకు సముచిత స్థానం కల్పిస్తామని పేర్కొన్నారు. బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం పోచారం మాట్లాడుతూ.. రేవంత్ నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం



పనిచేస్తున్నదని, వారికి మద్దతు ఇవ్వాలనే కాంగ్రెస్ లో చేరుతున్నట్టు తెలిపారు. కాగా, కేబినెట్ విస్తరణలో పోచారంకు మంత్రి పదవి ఇస్తారని, ఆ హామీతోనే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలుస్తున్నది ఇందుకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ వచ్చిందని ప్రచారం జరుగుతున్నది.

### బీఆర్ఎస్ నేతల అందోళన

పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ లో చేరుతున్న వేళ ఆయన ఇంటి ఎదుట బీఆర్ ఎస్ నేతలు ఆందోళన చేశారు. బంజారాహిల్స్ లోని పోచారం నివాసంలో సీఎం ఉన్న సమయంలోనే బాల్క సుమన్ తదితరులు లోపలికి వెళ్లేందుకు యత్నించారు. లోపలికి అనుమతించకపోవడంతో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్ కు తరలించారు. దీనిపై పోచారం స్పందిస్తూ బలవంతంగా పార్టీలో చేర్చుకోవడానికి తానేమీ చిన్న పిల్లాడిని కాదని పేర్కొన్నారు.





## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెచ్చే కుట్రలు

- భయపెట్టి లొంగదీసుకోవాలనుకుంటున్నారు
- మాజీ మంత్రి హరీశ్ రావు

**పటాన్ చెరు, జూన్ 21 (ప్రజాస్వరం) :** పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సోదరులను మాజీ మంత్రి హరీశ్ రావు శుక్రవారం పరామర్శించారు. ఈడీ దాడులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారాన్ని ఉపయోగించి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వేధిస్తున్నాయని విమర్శించారు. మహిపాల్ రెడ్డి ఇంట్లో ఈడీ సోదాల్లో ఏలాంటి అవినీతి ఆస్తులు దొరకలేదని తెలిపారు. నీట్ ప్రశ్నా పత్రాలను అమ్ముకున్న వారిపై ఈడీ ఎందుకు దాడులు చేయటం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో లక్షల మంది నీట్ పరీక్ష రాశారని, వారి భవిష్యత్తు అయోమయంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఒత్తిడికి గురిచేసి పార్టీలోకి చేర్చుకోవాలని చూస్తున్నదని మండిపడ్డారు.